# ఆపద్బాంధవి

"మరోసారి ఆలోచించమ్మా, ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం. బంధం తెంపుకోవడం సులువే. కాని విరిగిన మనసులు మళ్లీ అతుక్కోవటం చాలా కష్టం".

"అన్నీ తెలిసిన మీరే ఇలా అంటే ఎలా బాబాయ్? గత ఆరేడేళ్ళుగా నేనెంత మానసిక క్షోభను అనుభవించానో మీకు తెలుసుగా? మా శమిత గర్భంలో ఉన్నపుడు ఇంట్లోంచి తరిమేసిన ప్రబుద్ధునికి, కూతురికి ఆరేళ్ళొచ్చాక, ఇప్పుడు భార్య, బిడ్డలు జ్ఞప్తికి వచ్చారా? కొంతకాలం క్రితం మీరు కూడా మధ్యవర్తిత్వం వహించారు కదా? ఏమైనా ఫలితం దక్కిందా? వారికి ఇప్పుడు ఒక్కసారిగా ప్రేమ ఎలా పుట్టుకొచ్చింది? దీన్నిబట్టి వారి నైజం అర్థం చేసుకోండి బాబాయ్".

"మా అత్తింటి వారి గురించి మీకు పూర్తిగా తెలియదు బాబాయ్. వారొట్టి డబ్బు మనుషులు కాకపోతే, పెళ్ళైన సంవత్సరానికి మరింత కట్నం అడగడం ఏమిటి? వారడిగిన కట్నం, లాంఛనాలు అన్నీ పెళ్ళిలోనే ఇచ్చారు గదా మా వాళ్ళు? గవర్నమెంటు పాఠశాలలో ఉద్యోగం దొరకగానే అమాంతం కట్నం రేటు పెంచాలా? ప్రైవేటు టీచర్ నుండి ప్రభుత్వ టీచరుగా మారగానే మనిషి కూడా మారాలా? అప్పుడతని విలువ పెరుగుతుందా. అసలు కట్నం తీసుకోవటమే తప్పు. ఏదో

ఆనవాయితీ గదా అని మా వాళ్ళు కట్నమే కాక, వారి గొంతెమ్మ కోరికలన్నీ లాంఛనాల పేరుతో తీర్చారు.

అలాంటప్పుడు, ఓ సంవత్సరం తరువాత, అదీ నేను గర్భవతిగా ఉన్నప్పుడు, మరో రెండు లక్షల రూపాయల కట్నంతోనే వారి గడప తొక్కాలని శాసించడమేమిటి? నన్ను పుట్టింటికి తరమడమేమిటి? దీన్ని బట్టి వారి డబ్బు కక్కుర్తి అర్థం కాలేదా? అందుకని బాబాయ్, దయచేసి నా భర్తకాని భర్తకు విడాకుల నోటీసు ఇవ్వండి. శమితను పెంచడానికి భరణం కూడా బాగా అడగండి?" సుమిత కుండబ్రద్ధలు కొట్టింది".

"సరే, నువ్వన్నట్టే కానీవమ్మ. నాన్నగారితో ఓ మారుమాట్లాడి రేపే నోటీసు తయారు చేస్తాను."

"నేనూ, అమ్మ నాన్నా ఈ విషయంలో కూలంకషంగా చర్చించాకే ఈ నిర్ణయానికి వచ్చాం. ఇక మీదే ఆలస్యం. వస్తాను బాబాయ్." సుమిత, లాయర్ ఆఫీసు నుండి బయలుదేరింది.

ఇంటికి రాగానే మాధురి వచ్చి వెళ్ళిందని సుమితకు చెప్పింది వాళ్ళమ్మ.

"మాధురా? లక్నో నుంచెప్పుడొచ్చింది?

రెండు రోజులయింది. ఎల్లుండి తిరిగి వెళ్తుందట."

"అలాగా? అయితే ఇవాళ సాయంత్రమే మనింటికి పిలవాలి. అబ్బో ఎన్నాళ్ళయిందో దాన్ని చూసి!"

సుమిత, మాధురికి ఫోన్ చేసి దాదాపు ఆరేళ్లుగా పలకరించనందుకు చీవాట్లెట్టింది. సాయంత్రం నాలుగింటి కల్లా వచ్చి, రాత్రి భోజనం చేసి వెళ్ళమని శాసించింది. తన చిన్ననాటి నేస్తంతోఎన్నో కబుర్లు చెప్పుకోవాలని ఆతృతగా ఉంది సుమితకు. సాయంత్రం సుమిత చకోరపక్షిలా మాధురి కోసం గుమ్మం ముందు వేచి ఉంది. మాధురి రావడమే ఆలస్యం, ఆమెను అమాంతంగా కౌగిలించుకుంది. ఆరేళ్ళ ఎడబాటు వడ్డీతో సహా తీర్చుకుంది. ఆ తరువాత సంజాయిషీ అడిగింది. సమాధానం విని శాంతమయింది. పెళ్ళయిన తరువాత మనం పరాధీనులమే కదా అని మాధురిని సాంత్వన పరిచింది. టీ, ఫలాహారాలయ్యాక స్నేహితులిద్దరూ సుమిత గదిలో సెటిలయ్యారు.

'నా విషయాలు రాబట్టావుగానీ, నీ విషయాలు చెప్పవేం? నిలదీసింది మాధురి.

"ఏమున్నాయి చెప్పడానికి? గత ఆరేళ్ళుగా నేను పుట్టింట్లోనే ఉన్నట్టు వినే వుంటావు. ఎన్నో కలలతో అత్తవారింట్లో అడుగుపెట్టిన నాకు తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది.

మా కాపురం మూన్నాళ్ల ముచ్చటైంది. మరో వరకట్న చావుకు గురికాకూడదని మొండిగా, నా శమితను చూసుకుంటూ రోజులు వెళ్ళదీస్తున్నాను. ఇక్కడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తున్నాను."

"మనం పన్నెండవ తరగతి దాకానే కదా చదివింది? ప్రభుత్వబడిలో పంతులమ్మగా ఎలా కుదిరావు ?"

"నా ఈ ప్రగతికి మా అత్తవారికి ధన్యవాదాలు చెప్పాలి. మా వారికి గవర్నమెంట్ ఉద్యోగం రాగానే కొమ్ములు మొలిచాయి. పెళ్ళైనప్పుడే ఈ ఉద్యోగం ఉంటే మార్కెట్లో మరో రెండు లక్షలు ధర పలికేది గదా అని, సంవత్సరం కాపురం చేశాక మరో రెండు లక్షలు కట్నం కావాలని పట్టుబట్టారు. మా అత్తగారు సరే, డిగ్రీ చదివిన మావారు కూడా ఆమెకు వత్తాసు పలికే సరికి, నా మనసు విరిగింది. అదనపు కట్నం డబ్బులతోనే వారింట్లో మళ్ళీ కాలు పెట్టాలని, నన్ను మా పుట్టింటికి తరిమారు. భగవంతుని దయవల్ల పండంటి పాప పుట్టింది. పాపకు మూన్నెల్లు రాగానే నేను ప్రైవేటుగా డిగ్రీ చదవటం మొదలు పెట్టాను. ఆ తర్వాత బి.ఇడి లో సీటు సంపాదించాను. బి.ఇడి చదువుతూనే డి.యస్సీ రాశాను. మహిళల కోటాలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే బి.ఇడి పూర్తి చేశాను. ఇప్పుడు ఉద్యోగం కన్‌ఫర్మ్ కూడా అయింది. మా శమిత భవిష్యత్తుకిక ఢోకాలేదు. ఆ ధైర్యంతోనే ఇవాళ మా వారికి విడాకుల నోటీసు ఇవ్వమని లాయరుగారికి చెప్పివచ్చాను."

"శభాష్ సుమి! మన ఆడవాళ్ళ పరువు నిలబెట్టావు. పరిస్థితులకు తలవంచి, జరిగిన దానికి కృంగి పోకుండా పట్టుదలతో ప్రయత్నించి, నీ కాళ్ళ మీద నిలబడ్డావు. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ. అదిసరేగాని జీవితాంతం ఇలా ఒంటరిగానే ఉంటావా."

"ప్రస్తుతం అంతే, నా అభిరుచులకు తగ్గట్టు, నన్ను నన్నుగా గౌరవించి, శమితను కూతురుగా స్వీకరించడానికి ఒప్పుకునే పురుష ధీరుడెవరన్నా తారసపడితే అప్పుడాలోచిస్తాను. ప్రస్తుత సమాజంలో నా ఈ గొంతెమ్మ కోరిక ఫలిస్తుందనుకోను", సుమిత ఆలోచనల్లో స్పష్టత.

"నేనన్నది మళ్లీ పెళ్ళాడతావా లేదా అని కాదు. మీ వారికి ఇంకో అవకాశం ఇస్తే బావుంటుందేమోనని."

"ఆ విషయం వదిలెయ్ మధూ, నా నిర్ణయానికిక తిరుగులేదు. నువ్వన్నట్టుగానే మా వారు నా నిర్ణయాన్ని పునరాలోచించమని రాయభారం పంపారు. ఇటు నాకు ఉద్యోగం రాగానే మా అత్తింటి వారికి 'కనువిప్పు' కలిగింది. బంగారు గుడ్లు పెట్టే బాతును అప్పనంగా కొట్టేయాలని పథకం వేశారు. జరిగిందేదో. జరిగిపోయింది.

అది ఒక పీడకలలాగా మరిచిపోయి కాపురానికి పంపమని మా వాళ్ళ దగ్గరకి రాయబారం పంపారు. నేను గాని సరేనంటే స్వయంగా వచ్చి తీసుకెళతామని మా వారు కూడా నాకు ఉత్తరం రాశారు. అలాంటి కక్కుర్తి మనుషులతో జీవితాంతం వేగటం కష్టమని నేను త్రోసిపుచ్చాను. ఇక ఇలా ఊరుకుంటే లాభం లేదని విడాకుల దావా వేయాలని నిర్ణయించాము". సుమిత ఆవేశంతో ఊగుతోంది.

"శాంతించు సుమీ! నీ భావాలు నేనర్థం చేసుకోగలను. కాని అతనిలో నిజంగా 'మార్పు వచ్చిందని నీకు రూఢీగా తెలిస్తే మరో అవకాశం ఇవ్వు, ఆ నిర్ధారణకి రావటానికి మీరిద్దరూ ఓసారి కలుసుకోండి. అరమరికలు లేకుండా మాట్లాడుకోండి. శమితను తండ్రి ప్రేమకు దూరం చేయకు. ఏ మాత్రం సంకోచించకు. ఈ విషయంలో నువ్వు చొరవ తీసుకో. అది నీకూ నీ కూతురి భవిష్యత్తుకూ మంచిది." మాధురి ఆలోచనల్లో పరిణతి.

"సరే ఆలోచిస్తా కానీ భోజనం చేద్దాం పద." సుమితకు సంభాషణ పొడిగించడం ఇష్టంలేదు. భోజనం ముగించి మాధురి తాను చెప్పిన విషయం ఆలోచించమని మరోసారి గుర్తుచేసి వీడ్కోలు తీసుకుంది.

విడాకుల నోటీసు అందుకోగానే సుమిత అత్తింటి వారు షాకయ్యారు. సుమిత ఎన్నాళ్ళు ఒంటరిగా వుంటుంది? ఎప్పటికైనా తమ దగ్గరికి రాకపోతుందా? అని ధీమాతో ఉన్న వారు, నోటీసును చూసి ఢీలా పడిపోయారు. కాళ్ళ బేరానికి వచ్చారు. అదనపు కట్నం వద్దన్నారు. విషయం కోర్టులోనే తేల్చుకుందామని, వారిని త్రిప్పి పంపారు సుమిత తల్లిదండ్రులు. ఆడది అణిగిమణిగి ఉన్నంత వరకు ఇంకా అణచాలని చూస్తారు. ఒక్కసారి ఆమె ఎదురు తిరిగిందా ఇక ఆపడం కష్టం. ఎదుటి వాళ్ళు మట్టి కరవాల్సిందే. సుమిత విషయంలో అదే జరిగింది.

విడాకుల కేసు హియరింగు కొచ్చింది. ఇరుపక్షాల తరుపునా ప్రాధమిక వాదనలు జరిగాయి. ఆ తర్వాత వాయిదా పడింది.

ఎన్నో ఏళ్ళ తర్వాత భార్యాభర్తలు ఒకరినొకరు చూసుకున్నారు. సుమిత భర్త ఆనందం ముఖంలో ఆనందపు ఛాయలు మచ్చుకైనా లేవు. సుమిత మొహంలో మాత్రం మొక్కవోని ధైర్యం. కోర్టు నుండి బయటపడగానే ఆనందం చొరవ తీసుకుని సుమితను పలకరించాడు. శమితను కూడా కోర్టుకు తీసుకొచ్చి ఉంటే తను చూసే వాడినన్నాడు. ఒక్కసారి ఏకాంతంగా ముఖాముఖి మాట్లాడుకుందామని ప్రతిపాదించాడు. సుమితకు మాధురి సలహా జ్ఞప్తికి వచ్చింది. సరేనంది. తేదీ, చోటు, సమయం, నిర్ణయమయ్యాయి. ఇద్దరూ కంటి చూపులతోనే వీడ్కోలు తీసుకున్నారు!

కథా నిలయం
శ్రీకాకుళం

అనుకున్న ప్రకారం ఆనందం, సుమిత గుడి దగ్గర కలుసుకున్నారు. ఉపోద్ఘాతం లేకుండా ఆనందం మొదలు పెట్టాడు.

““సుమితా నీ దృష్టిలో నేను విలన్‌గా నిలిచాను. కాని నేను నువ్వనుకున్నంత చెడ్డవాణ్ని కాదు. ఉమ్మడి కుటుంబ బాధ్యతలో పడి నా గళం విప్పలేకపోయాను. అమ్మానాన్నల చెప్పుడు మాటలు నమ్మి నా జీవితం అస్తవ్యస్తం చేసుకున్నాను. నిన్ను నేనెంతగా ప్రేమించానో నువ్వు పుట్టింటికి వెళ్ళింతర్వాతగానీ తెలిసిరాలేదు. నా జీవితంలో ఏర్పడిన శూన్యం నీ రాకతోనే నిండుతుందని తెలుసుకోవటానికి నాకు కొన్ని రోజులు పట్టింది. అయినా నాకైనేను చొరవ తీసుకుని మావాళ్ళని ఎదిరించలేకపోయాను. అది నా తప్పే. అప్పటి నా బలహీనతను అధిగమించలేక పోయాను. నీ మీది ప్రేమ వల్లే నేను మరో పెళ్ళి గురించి ఆలోచించలేదు. మావాళ్ళు ఎన్నో సంబంధాలు చూశారు. కాని నేను మాత్రం మరోపెళ్ళి మాట తలపెట్టబోనని ఖరాఖండిగా చెప్పాను. ఎప్పటికైనా నువ్వు తిరిగి వస్తావని నాలో ఆశ, ప్లీజ్ నా ఆశను వమ్ము చేయకు. శమితను నా నుంచి దూరం చేయకు. మనమ్మాయి పట్ల, తండ్రిగా నా బాధ్యత నిర్వర్తించే అవకాశం ఇవ్వు, మనం ఓ కొత్త జీవితం ప్రారంభిద్దాం.” ఆనంద్ అభ్యర్థన.

“మీలాంటి డబ్బు మనుషుల మధ్యకి మళ్ళీ ఎలా వచ్చేది? ఆ భగవంతుని దయ వల్ల ఇపుడు దేనికి కొరత లేకుండా ప్రశాంతంగా వున్నాను. మళ్ళీ మీ ఇంటికి వచ్చి నా మనశ్శాంతిని కోల్పోవాలా?” సుమితలో అదే ఆవేశం.

“అప్పుడు మా కుటుంబ అవసరాలకై మిమ్మల్ని అదనపు కట్నం అడిగాము అది తప్పే. ఇప్పుడు నా బాధ్యతలు తీరిపోయాయి. మా చెల్లెళ్ళ పెళ్ళిల్లయ్యాయి. తమ్ముడు ఇంజనీరై ఉద్యోగం చేస్తున్నాడు. ఇక ఆర్థిక ఇబ్బందులేం లేవు మాకు. నా కాపురం నిలబెట్టడానికి అవసరమైతే వేరు కాపురం పెట్టమని మా అమ్మగారే అన్నారు, ఆ మాట నీతో చెప్పలేక నన్ను పంపించారు. ఇప్పుడు మన కాపురంలో మా కటుంబ సభ్యుల ప్రమేయం అసలుండదని హామీ ఇస్తున్నాను. దయ చేసి నీ నిర్ణయం మార్చుకో సుమితా” ఆనందం కళ్లల్లో నీళ్లు.

సుమిత కూడా చలించింది. సరే ఆలోచిస్తానని చెప్పి సెలవు తీసుకుంది.

ఆ తర్వాత మధ్యవర్తుల ద్వారా మంతనాలు మొదలయ్యాయి. ఇరుకుటుంబాల వారిలో బెట్టు సడలింది. లాయర్ తుకారాం ఆధ్వర్యంలో రాజీషరతులు ఖరారయ్యాయి. కేసు తరువాతి హియరింగులో లాయర్ తుకారాం ఇలా వాదించాడు.

"యువరానర్! ఈ రోజు నాకెంతో ఆనందంగా వుంది. విడిపోబోయే ఓ జంటను కలిపి నందుకు తృప్తిగా ఉంది. ఇంటర్ మీడియెట్‌తో చదువుకు స్వస్తి చెప్పిన ఓ గృహిణి, పరిస్థితుల ప్రాబల్యం వల్ల చదువుకొనసాగించి, తన కాళ్ళ మీద తను నిలబడగల్గింది. చదువు సుమితకు ఆపద్బాంధవిగా నిలిచింది. ఆమెలో ధైర్యం, స్థైర్యం కల్గించింది. ఆ చదువుతో సాధించిన ఉద్యోగబలంతో ఈ రోజు ఆమె తల ఎత్తి తిరగగల్గుతోంది. ఆ చదువుతో వచ్చిన సంస్కారంతో, ఆమె తన కాపురాన్నే కాదు, ఆత్మగౌరవం కూడా కాపాడుకుంది. ఈ కేసులో ఇరుపక్షాల వారు ఈ క్రింది అంశాలపై రాజీకి వచ్చారు.

1. సుమిత పెళ్ళిలో ఇచ్చిన రొక్కం మొత్తం శమిత పేర బ్యాంకులో పదేళ్ళ పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా వేయాలి.
2. సుమిత నెల జీతంలో ఇరవై అయిదుశాతం ఆమెకు నచ్చిన రీతిలో ఖర్చు పెట్టే స్వాతంత్ర్యం ఉండాలి. ఆ విషయంలో ఎలాంటి సంజాయిషీ అడగరాదు.
3. సుమిత పుట్టింటికి వెళ్ళడానికి ఎలాంటి ఆంక్షలు విధించరాదు. పండుగలకు పిలిచినప్పుడల్లా ఆనందం కూడా తన అత్తవారింటికి వెళ్ళాలి. అత్తవారిని తమింటికి ఆహ్వానించాలి.

"ఈ సమ్మత షరతులు కోర్టువారు పరిగణనలోకి తీసుకుని తీర్పు ఇవ్వాలని కోరుతున్నాను. సమ్మతి షరతుల రాజీ మూలంగా ఈ కేసును నా పక్షకారులు వాపసు తీసుకోవటానికి అనుమతించగలరని కోర్టు వారిని కోరుతున్నాను"

ఆ ప్రకారం న్యాయమూర్తి తీర్పు ఇవ్వగానే అక్కడున్న అందరి మొహాలలో ఆనందం వెల్లివిరిసింది. ఆనందం సంగతి ఇక చెప్పక్కర్లేదు.